తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- వేసవిలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు
- నీరు వృథాగా పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- కమిషనర్ ప్రవీణ్‌చంద్ అధికారులతో సమీక్ష



నీటి సరఫరాపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రస్తుత వేసవి కాలంలో కడప నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం కడప నగర పాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజినీరింగ్ అధికారులు, ఫిట్టర్లు, హెడ్ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన నగరంలో నీటి సరఫరా పట్టికలను జోన్‌ల వారీగా పరిశీలించారు. నీటి సరఫరా వివరాలను వెబ్‌సైట్ ద్వారా తెలియజేసేలా తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రామరాజుపల్లి, బండి కనుమ, పాత మున్సిపల్ కార్యాలయాల్లో నీటి నిల్వలను తెలుసుకున్నారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజూ ఏ ప్రాంతంలో, ఏ సమయానికి నీటిని సరఫరా చేస్తున్నారో ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఉన్న నీటి బోర్ల మరమ్మతులను తక్షణమే చేయించి, అవి కూడా సజావుగా పనిచేయు విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్క డివిజన్‌లో నీటి సరఫరా రిపోర్టులను పరిశీలించారు. నీటిని పొదుపుగా వాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటి సరఫరా పట్టికలను ప్రతి రోజూ గూగుల్ షీట్ ద్వారా అప్డేట్ చేయు విధంగా చర్యలు తీసుకోవాలని కంట్రోల్ రూమ్ వారికి సూచించారు. ఎక్కడా నీరు వృథాగా పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉన్న బోర్లను వాటి సామర్థ్యం మేరకు ఉపయోగించుకోవాలన్నారు. నీటి సరఫరా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయు విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. ఫిర్యాదు వచ్చిన ఆరు గంటల్లోగా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. నీటి సరఫరా చేయు విషయంలో నిర్లక్ష్య వైఖరి ఉండకూడదన్నారు. ప్రజలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా సజావుగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, ఈఈలు నారాయణస్వామి, ధనలక్ష్మి, డీఈలు కరిముల్లాఖాన్, రాజేష్, వేణుగోపాల్, ఏఈ మణిగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి

కడప నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని నగరపాలక సంస్థ డీఈఈ కరిముల్లా ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్లుగా రాష్ట్రంలో తగినంత వర్షపాత లేనందున ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో నీటి మట్టం అడుగంటి పోయిందన్నారు. నగర ప్రజలకు తాగునీటిని అందించే పెన్నానదిలో లింగంపల్లి, వాటర్ గండి, రామసపల్లె వద్ద, బుగ్గ లోకల్ బోర్లు అడుగంటిపోయి 50.92 ఎంఎల్‌డీల నీరు సరఫరా కావాల్సి ఉండగా, ప్రస్తుతం 37 ఎంఎల్‌డీలు మాత్రమే సరఫరా అవుతోందన్నారు. కలెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు గండికోట నుంచి మైలవరానికి, మైలవరం నుంచి లింగంపల్లి పంప్‌హౌస్‌కు నీటిని వదిలేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. మైలవరం రిజర్వాయర్ నుంచి పెన్నానదికి మార్చి 1న 160 క్యూసెక్కుల నీటిని వదిలారని, 20వ తేదీన 200 క్యూసెక్కులకు పెంచడం జరిగిందన్నారు. 60.కి.మీ దూరం ఉన్నందున నీటిలో 40 శాతం మాత్రమే వచ్చే అవకాశం ఉన్నందున, లింగంపల్లిలో తాత్కాలికంగా సిమెంటు సంచులతో ఇసుక నింపి కట్టను నిర్మించడం జరిగిందన్నారు. ఆ నీరు లింగంపల్లి చేరేందుకు మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని, ఆ లోపు ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

తాటి ముంజలకు గిరాకీ



తాటి ముంజలను అమ్ముతున్న వ్యాపారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రస్తుతం వేసవి కాలంలో ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు చల్ల దనాన్ని అందించే తాటి ముంజలకు యమ గిరాకీ ఉంది. నగరంలోని కోటిరెడ్డి సర్కిల్, ఎస్పీ బంగాళా, అప్సర సర్కిల్, ఐటీఐ సర్కిల్, రింగ్ రోడ్డు సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో వీటి అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలోని పెండ్లిమర్రి మండలం నందిమండలానికి చెందిన పలువురు తాటి ముంజలను తీసుకువచ్చి అమ్ముతున్నారు. వీటి ధర డజను రూ.100 వరకు అమ్ముతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ జాతర



గంగమ్మ గుడిలో పూజలు నిర్వహిస్తున్న మేయర్ కె.సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 9వ డివిజన్ ఎన్‌జీవో కాలనీలో వెలసిన గంగమ్మ దేవాలయంలో జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కడప మేయర్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు దర్శించుకున్నారు. 9వ డివిజన్ ఇన్‌చార్జి మల్లికార్జున కిరణ్, గుడి ధర్మకర్త కంబగిరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సకాలంలో వర్షాలు కురిపించి, రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లారెడ్డి, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రమణ

కడప కార్పొరేషన్ : కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఎర్రముక్కపల్లెలోని విద్యుత్ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎస్.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ఉద్యోగులు, వినియోగదారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ చలివేంద్రాన్ని పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం అధ్యక్షులు ఈ. నాగరాజు(ఈఈ, కన్‌స్ట్రక్షన్) ప్రధాన కార్యదర్శి ఎంపీ చలపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నికల్ హరి సేవ్యానాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు భరణి క్రిష్ణ, శివ భాస్కర్, నాగ శేషారెడ్డి, ఫయాజ్ యూనియన్ నాయకులు సురేంద్ర, నరసింహులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భూ మార్పు ప్రక్రియలో 'రెవెన్యూ' నిర్లక్ష్యం

ముద్దనూరు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో భూమి (మ్యుటేషన్)మార్పు ప్రక్రియలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. భూమి క్రయ విక్రయాల, రిజిస్ట్రేషన్‌ల అనంతరం ఆన్‌లైన్‌లో రైతులు భూ మార్పుకు దరఖాస్తు చేసుకుంటారు. తర్వాత తహసీల్దారు కార్యాలయంలోని సిబ్బంది వాటిని పరిశీలించి 15 రోజుల తర్వాత మ్యుటేషన్(మార్పు)ను పూర్తి చేయాల్సివుంటుంది. వీటి పూర్తి బాధ్యత రెవెన్యూ సిబ్బందిదే. అయితే స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని సిబ్బంది సమన్వయలోపంతో కొద్దిరోజులనుంచి భూముల మ్యుటేషన్(మార్పు)లలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో అధికారుల, సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో సుమారు 40 భూ మ్యుటేషన్ల(మార్పు) ప్రక్రియ అస్తవ్యస్తంగా తయారైంది. సరైన కారణాలు లేకుండానే మ్యుటేషన్ల(మార్పు)ను రిజెక్ట్‌చేశారని దీంతో తాము మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నదన్నారు. ప్రభుత్వం ఆటో మ్యుటేషన్ ప్రక్రియ అమలు చేస్తున్నప్పటికీ స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని ఉన్నతాధికారులు చొరవ చూపి మ్యుటేషన్లను సకాలంలో పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు ఉపకార వేతనాల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక కొర్రపాడు రోడ్డులోని కేసీ పుల్లయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసీ పుల్లయ్య వర్ధంతి సందర్భంగా ఉపకార వేతనాలను పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మినిస్ట్రీ ఆఫ్ జల్‌శక్తి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా స్పెషల్ చీఫ్ సెక్రటరీ అండ్ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్, సీనియర్ పబ్లిక్ హెల్త్ స్పెషలిస్టు డాక్టర్ సంతోషకుమార్, డాక్టర్ చంద్రశేఖర్, ఋషిహుడ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శోభిత్ మాథుర్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్ తదితరులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

31న చిత్ర లేఖన పోటీలు

చాపాడు: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 31న చిత్ర లేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. మూడు విభాగాల్లో 1 నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు నగదుతో పాటు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 27 లోగా సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో రూ.500, రూ.400, రూ.300ల చొప్పున ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 8500857111, 850086111 నంబర్లను సంప్రదించాలని చైర్మన్ కోరారు.

వైఎస్సార్‌సీపీ నగర కమిటీల నియామకం

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నగర, అనుబంధ కమిటీలను ప్రకటిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులుగా ఎన్.వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.కొండయ్య, సయ్యద్ గౌస్‌పీర్, జనరల్ సెక్రటరీలుగా ఎస్.లక్ష్మీనారాయణ రావు, వి.గోపాలకృష్ణ, పఠాన్ అహ్మద్ అలీఖాన్, సెక్రటరీలుగా హెచ్.తులశమ్మ, వై.సుదర్శన్, ఎస్.రవిచంద్రరావు, జి.చంద్రమోహన్‌రెడ్డి, జయశ్రీ, ట్రెజరర్‌గా ఉస్మాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా భాస్కర్‌రావు, రామకృష్ణ, నజీర్, రఖీబ్‌జాన్, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, షబ్బీర్, మల్లికార్జున, రెడ్డెయ్య, అబ్దుల్ రౌఫ్, భాగ్యమ్మ, వెంకట రమణ, శ్రీరాములు, సుబ్బారెడ్డిలను నియమించారు.

క్రిస్టియన్ మైనార్టీ విభాగం

కడప నగర క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులుగా ఎస్.విజయకిశోర్, ఉపాధ్యక్షులుగా బీఎస్.జాన్, ఎస్.ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా కె.ఏసుదాస్, బి.యాదరాజు, ఎస్.ప్రసాద్, వై.వినోద్ కుమార్, ఎం.బాబురావు, జె.జవహర్‌లతోపాటు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలను నియమించారు.

సాంస్కృతిక విభాగం

కడప నగర పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా వై.సాయి హుసేన్, ఉపాధ్యక్షులుగా బి.శివనాగిరెడ్డి, వి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శులుగా ఎం.చెన్నయ్య, జి.వెంకటేశ్వరరావు, ఐ.వీరభద్రస్వామి, ఎం.జానకిరాం, ఎ.విశ్వనాథరెడ్డి, బి.సూర్యకళతోపాటు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలను నియమించారు.

మహిళా విభాగం

మహిళా నగర విభాగం అధ్యక్షురాలిగా టీపీ వెంకటసుబ్బమ్మ, ఉపాధ్యక్షురాలిగా ఎ.తులశమ్మ, ఎం.సుశీలమ్మ, ప్రధాన కార్యదర్శులుగా జి.పద్మ, టి.జ్యోతి, బి.రామలక్షుమ్మ, జి.మల్లీశ్వరి, ఎ.సావిత్రమ్మ, ఎస్.హైమావతితోపాటు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలను నియమించారు.

ఎస్టీ విభాగం

ఎస్టీ విభాగం నగర అధ్యక్షులుగా కె.వెంకట రమణ, ఉపాధ్యక్షులుగా ఎం.గంగరాజు, జగన్నాథంబాబు, ప్రధాన కార్యదర్శులుగా పి.శ్రీనివాసులు, వి.యోగానంద, బి.జగన్నాయక్, జె.విజయ్‌కుమార్, వి.రవితేజ, ఎస్.శేఖర్‌లతోపాటు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలను నియమించారు.

సేవాదళ్ విభాగం

వైఎస్సార్ సేవాదళ్ నగర విభాగం అధ్యక్షులుగా ఎ.అర్జున్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎ.మురళి, ఆర్.బాలాజీసింగ్, ప్రధాన కార్యదర్శులుగా టి.సురేంద్ర, వి.రామాంజనేయులు, వి.దశరథరామిరెడ్డి, అలీబాషా, కె.వెంకటేశ్, కె.చంద్రానాయక్‌లతోపాటు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలను నియమించారు.

వైఎస్సార్ టీయూసీ నగర కమిటీ

వైఎస్సార్ టీయూసీ నగర కమిటీ అధ్యక్షులుగా నంద్యాల నాగరాజు, ఉపాధ్యక్షులుగా పి.ఫయాజ్‌ఖాన్, ఎ.చంద్రమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎం.శ్రావణ్‌కుమార్, పి.దేవరాజు, బి.రెడ్డిశేఖర్, పి.షేర్‌ఖాన్, షేక్ చాంద్‌బాషా, జి.చిన్న రామసుబ్బయ్యలతోపాటు సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలుగా నియమించారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

వైవీయూ : మొక్కలు నాటడం, సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -3, 6, 9 ప్రోగ్రాం ఆఫీసర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు మొక్కలను విరివిగా నాటాలన్నారు. అనంతరం అటవీ సంరక్షణ అనే అంశంపై నిర్వహించిన పెయింటింగ్ పోటీలలో విజేతలు ఎస్.ఏడుకొండలు, ఎ.స్వాతి, పి.లక్ష్మిలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్‌లు కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీధర్‌రెడ్డి, కె.మృత్యుంజయ రావు, బి.ఈరప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.



వైవీయూలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో ప్రోగ్రాం కోఆర్డినేటర్, పీఓలు, విద్యార్థులు

నీటి సంరక్షణ అవగాహన పోస్టర్లు విడుదల

యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ – 1 ప్రోగ్రాం ఆఫీసర్ గంగయ్య ఆధ్వర్యంలో నీటి సంరక్షణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. పెండ్లిమర్రి మండలం ఎల్లటూరులో వారం రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా నీటి సంరక్షణపై గ్రామీణులకు అవగాహన కల్పించారు. నీరు ఉంటేనే ప్రాణకోటి ఉంటుందని, లేదంటే నిర్జీవమేనని తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటు అవగాహన కార్యక్రమం

యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ -4 వలంటీర్లు పెడ్లిమర్రి మండలం మిట్టమీదపల్లెలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, గ్రామీణ ప్రజలకు ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ సునీత మాట్లాడుతూ చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి మన ఓటు అత్యంత కీలకం అని వివరించి, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

కడప నగరంలో..

కడప నగరంలోని పక్కీరుపల్లెలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అల్ షిఫా కేంద్రం వ్యవస్థాపకుడు మహమ్మద్ రఫీ

కడప కల్చరల్ : పిల్లలు మానసిక వికలాంగులుగా పుట్టేందుకు కారణమవుతున్న డౌన్ సిండ్రోమ్ పట్ల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని అల్ షిఫా కేంద్రం వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ తెలిపారు. గురువారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా కడప నగరం పాత రిమ్స్‌లోని అల్ షిఫా కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ అనేది క్రోమోజోమ్ సాధారణ పరిస్థితి వల్ల ఏర్పడుతుందన్నారు. మానవ శరీరంలో 21 జతల క్రోమోజోములకు అదనంగా ఒక క్రోమోజోమ్ ఉంటే డౌన్ సిండ్రోమ్ పుట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. డౌన్ సిండ్రోమ్ భౌతిక లక్షణాలను బాదం ఆకారంలో కళ్లు, చిన్న మెడ, చిన్న చెవులు, నోటిలో నుంచి బయటికి వచ్చేలా ఉండే నాలుక, చిన్న చేతులు, కాళ్లు, పిల్లలు, పెద్దలు ఎత్తు తక్కువగా ఉండడంగా చెప్పవచ్చన్నారు. 700 మంది శిశువులలో ఒకరికి ఈ సమస్య వస్తుందని, సాధారణంగా గర్భధారణ సమయంలో 35 ఏళ్ల కంటే ఎక్కువ వయసు ఉన్న తల్లులకు డౌన్ సిండ్రోమ్ పిల్లలు జన్మిస్తారన్నారు. గర్భధారణ సమయంలో జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత వరకూ మేనరికపు వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్‌షిఫా సంస్థ సిబ్బంది, మానసిక వికలాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు హోమియోలో మందులు



విద్యార్థులకు హోమియో మందులు మింగిస్తున్న డాక్టర్ షాకీర్‌హుసేన్

కమలాపురం : వడదెబ్బ నివారణకు హోమియోలో మందులు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ హోమియో వైద్యాధికారి షాకీర్ హుసేన్ తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లెలో ఉర్దూ, తెలుగు ప్రాథమిక పాఠశాల్లో హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులందరికి వడదెబ్బ నివారణకు నాట్రమ్ మురియాటికం-200 మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు హోమియోలో అద్భుత మందులు ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎండల్లో తిరిగే వారు, ఉపాధి కూలీలు ఈ మందులను వినియోగించు కోవాలన్నారు. వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వదులుగా ఉన్న నూలు దుస్తులు ధరించాలన్నారు. ఉదయం 11 గంటలకే ఇంటికి చేరుకోవాలని, సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దన్నారు. అలాగే మజ్జిగ, నన్నారి, నీళ్లు ఎక్కువగా తాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, హోమియో సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ వ్యక్తిత్వం భవితకు ముఖ్యం



జ్యోతి ప్రజ్వలనలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధేశ్వరరావు, అధ్యాపకులు

ప్రొద్దుటూరు : మనిషి సమాజంలో ఎంత ఎత్తుకు ఎదిగినా ఉత్తమ వ్యక్తిత్వం కలిగి ఉండడం ముఖ్యమని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వెన్నపూస బ్రహ్మానందరెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మనం విచారంగా ఉంటే మన జీవితం పరిహాసం చేస్తుందని, మనం సంతోషంగా ఉంటే జీవితం చిరునవ్వు చిందిస్తుందన్నారు. మన సంతోషం ఇతరులకు పంచితే జీవితం సలామ్ చేస్తుందని చెప్పారు. మిమ్మల్ని మీరు ఎవరితోనూ పోల్చుకోవద్దని, అలా చేస్తే మిమ్మల్ని మీరు అవమానించుకున్నట్లేనని పేర్కొన్నారు. పరిష్కారం లేని సమస్యలు ఉండవని, ప్రతి సమస్యకి పరిష్కారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సిద్ధేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ ఎం.రజనీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు రామాంజనేయరెడ్డి, ఎం.శ్రీనివాసులు, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంను ప్రారంభిస్తున్న కమాండెంట్

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ 3వ గేటు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాన్ని గురువారం బెటాలియన్ కమాండెంట్ పి. రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని రోడ్డుపై ప్రయాణించే ప్రయాణీకులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకే ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు తిరుపతిరెడ్డి

పోరుమామిళ్ల : బద్వేలు ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కామ్రేడ్ కల్లూరు తిరుపతిరెడ్డి నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయుడని ఆ పార్టీ నేతలు కొనియాడారు. గురువారం తిరుపతిరెడ్డి 9వ వర్ధంతిని పురస్కరించుకొని రాజాసాహెబ్‌పేటలో ఆయన స్తూపం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళి అర్పించారు. తిరుపతిరెడ్డి తెలుగుగంగ ప్రాజెక్టు కోసం, రైతాంగ సమస్యల పరిష్కారానికి భూస్వాములకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారని నాయకులు గుర్తుచేశారు.

వ్యక్తి అరెస్ట్.. కేసు నమోదు

అట్లూరు: మండలంలోని వేములూరు సగిలేరు వంతెన వద్ద నాటుసారాతో వెళుతున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ కె.సి.రాజు తెలిపారు. పక్కా సమాచారంతో సారాతో వెళ్తున్న సి.కె.దిన్నె మండలం జమాల్‌పల్లె గ్రామానికి చెందిన సిగె వెంకటయ్యను గురువారం అదుపులోకి తీసుకొని 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని ఎస్ఐ తెలిపారు.

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వైవీయూ : పదో తరగతి మూల్యాంకన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కడప జిల్లాశాఖ కోరింది. గురువారం కడప నగరంలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎం.అనూరాధాను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి మూల్యాంకన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. 58 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులు, గర్భవతులు, చిన్నపిల్లల తల్లులు, అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీరు, మజ్జిగ సరఫరా చేయాలని, చలువ పందిర్లు, ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని కోరారు. విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవికుమార్, గోపీనాథ్, బి.చంద్రశేఖర్, పి.చంద్రశేఖర్, వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయండి



ఆర్‌జేడీకి వినతిపత్రం అందజేస్తున్న రూటా నాయకులు

వైవీయూ : జిల్లాలోని ఉర్దూ పాఠశాలల బలోపేతానికి సహకారం అందించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) నాయకులు కోరారు. గురువారం కడప ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ వై.రాఘవరెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూటా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అయూబ్, రాష్ట్ర కన్వీనర్ షహబుద్దీన్ మాట్లాడుతూ రెండో అధికార భాష ఉర్దూ మీడియంను ఇంగ్లిషు మీడియంతో పాటు సమాంతరంగా నిర్వహించాలని కోరారు.

మెస్, కాస్మోటిక్స్ చార్జీలు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

వైవీయూ : ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్స్ చార్జీలను విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమాధికారి నరసయ్యకు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, ఏఐఎస్‌బీ ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఓబయ్య, శ్రీనాథ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్, అవినాష్‌రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపిద్దాం

- వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి



మాట్లాడుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

పులివెందుల : రాబోయే ఎన్నికల్లో పులివెందుల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అలాగే కడప ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపిద్దామని వైఎస్సార్సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు తెలిపారు. గురువారం సాయంత్రం భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించడానికి ఆర్యవైశ్యులు సహకారం అందించాలన్నారు. ఐదు దశాబ్దాలుగా పులివెందులలోని ఆర్యవైశ్యులు వైఎస్ కుటుంబ సభ్యులను ఆదరిస్తున్నారన్నారు. అలాగే వారికి కూడా వైఎస్ కుటుంబ సభ్యులు అండగా ఉంటున్నారన్నారు. ఆర్యవైశ్య సంఘం వైఎస్ కుటుంబ సభ్యులకు అన్ని వేళలా వెంట నడిచారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించినప్పుడు కానీ, ఆయన కష్టకాలంలో కానీ ఆర్యవైశ్యులు మేమున్నామంటూ తోడుగా ఉన్నారన్నారు. ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు కొత్త రవికుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్ అవినాష్‌రెడ్డికి ఆర్యవైశ్య సంఘం తరపున పూర్తి మద్దతు ఉంటుందన్నారు. పులివెందులను మహానేత వైఎస్సార్, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్‌సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ మిట్ట హరి, ట్రెజరర్ గంగాధర, పులివెందుల ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ పట్టాభి రామయ్య, మహిళామండలి చైర్మన్ మాధవిలత, రాష్ట్ర మహాసభ ట్రెజరర్ మిట్టా కరుణాకర్, ఆవోపా సెక్రటరీ సాయిబాబా, గండి ట్రస్ట్ బోర్డు మెంబర్ బిందుసాగర్, వాసవిక్లబ్ అధ్యక్షుడు మహేశ్, పబ్బతి నారాయణ, పట్టణంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.